

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం, 24 జూన్ 2025 | 8 పేజీలు

ప్రతి ఫిర్యాదుకి పరిష్కారం చూపాలి

- డిఆర్వో విశ్వేశ్వర నాయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని డిఆర్వో విశ్వేశ్వరనాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సబా భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్వో విశ్వేశ్వర నాయుడుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచిస్తూ అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ వెంకటపతి, జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సొంత మండలంలోనే బదిలీలు నిర్వహించండి

- సచివాలయ ఉద్యోగుల నిరసన - సంఘీభావం తెలిపిన మేయర్ సురేష్ బాబు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను సొంత మండలాల్లోనే బదిలీలు చేయాలని గ్రామ వార్డు సచివాలయం అన్ని కేటగిరీల సెక్రటరీలు కోరారు. సోమవారం నగరంలోని సచివాలయ ఉద్యోగులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 2019-22 వరకు తక్కువ జీతంతో పని చేశామని చెప్పారు. ఆ కాలాన్ని కూడా ఐదు సంవత్సరాల సర్వీసులో భాగంగా పరిగణించడం అన్యాయమని తెలిపారు. డిప్యుటేషన్ పేరుతో ఇప్పటికే ఒక్కో సెక్రటరీ మూడు నుంచి నాలుగు సచివాలయాల్లో పనిచేశారని పేర్కొన్నారు. ఒక మండలం నుంచి మరో మండలానికి బదిలీలు చేయాలని ప్రభుత్వం సిఫార్సు చేసిందని, పట్టణాల్లో బదిలీలు కావడం చాలా ఇబ్బందికరమని చెప్పారు. ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న బదిలీల నిర్ణయాలు మాకు, మా కుటుంబాలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన వారికి ప్రమోషన్ కల్పించాకే బదిలీల అమలు చేయాలని కోరారు. నిరసనకు సంఘీభావం తెలియజేసిన మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండేదని పేర్కొన్నారు. వాలంటీర్లకు రూ .10,000 వేతనం ఇస్తామని కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బసవరాజ్, ఈటె రామచంద్రయ్య, కిరణ్, రెడ్డి ప్రసాద్, అన్ని డివిజన్లకు సంబంధించిన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలం మారింది..
వేరుశనగ పంటకు మంగళం

- కనుచూపుమేర కన్పించని సాగు
- ప్రత్యామ్నాయంపైనే ఆధారం
- ప్రధాన పంటగా పత్తి

విశాలాంధ్ర-పులివెందుల: ఖరీఫ్‌లో సాగు చేసే వేరుశనగ పంటకు రైతులు మంగళం పాడారు. సమయం వచ్చినా కనుచూపుమేర సాగు కన్పించలేదు. దీంతో ప్రత్యామ్నాయంపైనే సగటు రైతు ఆధార పడక తప్పలేదు. ఇందుకు పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా పత్తిని ప్రధాన పంటగా వేశారు. నాగలి కుంచెతో పుడమికి పచ్చటి రంగద్దినట్లు వేరుశనగ కనిపించేది. సాధారణంగా ఖరీఫ్ అంటేనే వేరుశనగ పంటకు పెట్టింది పేరు. కొంత మంది వర్షాధారంపై మరి కొందరు నీటిపై ఆధారడి సాగు చేసేవారు. ప్రస్తుతం కృష్ణాజలాలు అందుబాటులో ఉన్నా గొట్టపుబోర్లలో సరిపడు నీరున్నా వేరుశనగపై మక్కువ చూపలేదు. ఇందుకు వేరుశనగకు ఖర్చు విపరీతంగా వస్తుంది. ఎకరాల వేరుశనగ సాగు చేయాలంటే సుమారు రూ.25వేలు దాకా వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇక దిగుబడి వస్తే కొనుగోలు చేసే సమయంలో ఉన్న ధర ఉండదని, కనీసం సాగుకు వెచ్చించిన పెట్టుబడి బేరీజు వేసుకుంటే కూళ్లు కూడా గిట్టవని రైతులు తెలిపారు. ఈ పరిస్థితి చూస్తే కొనుబోతే కొరివి అమ్మబోతే అడవి అన్న సామెతలా ఉందన్నారు. ఇవే కాకుండా ముఖ్యంగా తెగుళ్ల సమస్య

3లో

విత్తన ధరలు ఖరారు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్న వేరుశనగ విత్తన కాయల ధరలు ఖరారు చేసింది. ఆ మేరకు 40శాతం రాయితీతో విత్తనకాయలను అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. అవసరమైన రైతులు 60శాతం చెల్లించాల్సి ఉంది. కడప జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 5976హెక్టార్లు, అలాగే నీటి వనరుల కింద 1661 హెక్లార్లు, వర్షాధార భూముల్లో 4315హెక్టార్లలో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. వీరికి కె నారాయణ, టిసిజిఎస్-1694 రకం విత్తనకాయలను పంపిణీ చేయనున్నారు. అలాగే అన్నమయ్య జిల్లాలో వేరుశనగ 38.013 హెక్టార్లు సాగు చేయనున్నట్లు అధికారులు గుర్తించారు. మరి పులివెందుల ప్రాంతంలో మేరకు సాగు చేస్తారో చూడాలి.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-రాయచోటి: జిల్లాలోని నిరుద్యోగులు మదనపల్లె విశ్వహిత డిగ్రీ కళాశాల లో ఈనెల 27వ తేదీన జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్ఓ మధు సూదన రావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జున కోరారు. సోమవారం మెగా జాబ్ మేళా గోడ పత్రాలను ఆవి ష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగమేళలో ఎయుస్మాల్ ఫిన్ బ్యాంక్, హె ట్రో ల్యాబ్స్, అపోలో ఫార్మసీ, ఎస్బిఐ కార్డ్స్, హీరో మోటో క్రావ్, ముత్తూ ట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు పాల్గొంటా యని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీ.జీఓవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

- వ్యర్థాలతో నదీ కాలుష్యం
- జిల్లా అధికారులు ఆదేశాలు బేఖాతరు

కుషావతీ.. ఏమి నీ గతి..!

విశాలాంధ్ర-గాలివీడు: గల గలా పారే కుషావతి నది నేడు చెత్తా చెదారం వ్యర్థాలతో కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. నదీ కాలుష్యం జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ అధికారులు దగ్గరుండి మరీ పంచాయతీ ట్రాక్టర్‌లో పట్టణంలోని వ్యర్థాలను నదీ తీరంలో పడవేస్తున్నారు. ఒవైపు నదిలో చేపలు, జల చరాలు మృత్యువాత పడుతుంటే మరోవైపు మృత్యువాత పడిన జంతు కాళేబరాలు, వ్యర్థాలను అదే నదిలో పడేస్తూ జల కాలుష్యాన్ని పెంచుతున్నారు. కుషావతీ నది పరిసరప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న స్థానికులు రాకపోకలు సాగించాలంటే దుర్గంధంతో ముక్కులు మూసుకుని వెళ్లే దుస్థితి నెలకొంది. ఈ చెత్త చెదారం కారణంగా దోమల బెడద ఎక్కువై వ్యాధుల బారిన పడుతున్నామంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు స్థానికులు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ స్థాయి అధికారులను కలసి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ డంపింగ్ యార్డ్ కు స్థల కేటాయింపు చేసి నదీ కాలుష్యాన్ని నివారించాల్సిందిగా తాసీల్దార్, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినా, అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కపెట్టడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నదీ కాలుష్యాన్ని నివరించేలా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

డీఎంహెచ్‌వోగా లక్ష్మీనరసయ్య

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ లక్ష్మీనరసయ్య సోమవారం భాధ్యతలు స్వీకరించారు. ఈ మార్చి నెలలో డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ కొండయ్య పదవీ విరమణ చేపట్టడంతో డాక్టర్ ఉషశ్రీ జూన్22వ తేదీ వరకు పూర్తి స్థాయిలో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సాదారణ బదిలీలలో భాగంగా డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ అయ్యారు. ఈ సందర్బంగా నూతన కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

వీరబల్లిలో వికసిత్ భారత్ సంకల్ప సభ

విశాలాంధ్ర-వీరబల్లి: మండలం లోని మట్లి గ్రామపంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప సభ జరిగింది. ఈ సభ వీరబల్లె మండల బిజెపి అధ్యక్షుడు అనంతరాజు ఆద్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమం ముఖ్య అథిదిగా రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామ జగదీష్ స్వామి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భారత దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ఆద్వర్యంలో ఈ 11 సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి వైపు వెల్తుంది అలాగే సేవ సుపరిపాలన, పేదల సంక్షేమ వైపు చారిత్రక పురోగతిని సాధించింది. అందరితో కలసి అందరి అభివృద్ధి అందరి క్రుషి అందరి విస్వాసం అనే మాటతో మన ప్రధానమంత్రి ప్రతి పౌరుడు ని ఉత్తేజ పరుస్తు భారత దేశాన్ని ముందుకు నడుపుతున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధి ద్వారా 3.7 లక్షల కోట్లు పైగా రైతులు నేరుగా ఆదాయం వారి ఖాతాలకు వేయడం జరుగుతుంది. మోదీ ఆద్వర్యంలో కేంద్రం ప్రభుత్వం సౌభాగ్య యోజన కింద ఆసక్తి గల గ్రుహాలకు విధ్యుత్తును అందించింది. అలాగే ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా లబ్ధి. బేటి భచావో భేటి పడావో వంటి చర్యలతో లింగ విపక్షలు లేకుండా చూఢడం. అగ్నిపథ్ యోజన ద్వారా యువతకు సైన్యంలో సేవ చేయడానికి కొత్త అవకాసాన్ని అందిస్తుంది. జాతీయ విధ్యా విధానం ద్వారా భారతదేసాన్ని సూపర్ పవర్ గా మార్చే కలను సాకారం చేసింది. అందరికీ అందుబాటులోకి ఆరోగ్య సంరక్షణ మరియు ఉచిత వైద్యం. లాంటివి అన్నీ సంక్షేమ పథకాలను ప్రజలకు ఇచ్చినది అని తెలిపారు. విశ్వకర్మ యోజనను చేతి వ్రుత్తులవారు ఉపయోగించి కోవాలని తెలిపారు. ఎంపీటీసీ శ్రినివాసులు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, డిల్లి నుండి గ్రామ స్తాయి వరకు దేశ వ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేస పెట్టారు అని తెలియజేయడం జరిగింది అని తెలిపారు. అనంతరం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంకు మండల ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, మట్లి ఎంపీటీసీ రాపూరు శ్రీనివాదులు మాజి అధ్యక్షులు నరేంద్ర, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసం మనోధైర్యమే విద్యార్థుల విజయానికి పునాదులు: విశాల్ రెడ్డి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: విద్యార్థిని విద్యార్థుల ఆత్మ విశ్వాసం మనోధైర్యమే విజయానికి పున్నాదులు అని కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి తనయులు ముక్కా విశాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం ముక్కావారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో విశాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ఓబులవారిపల్లి మండలంలోని కృష్ణంపల్లి గ్రామానికి చెందిన కె శ్రామిత 589/600 మార్కులు సాధించిన విద్యార్థిని కి 15 వేల రూపాయలు, అయ్యలరాజుపల్లి గ్రామానికి చెందిన సిపి నీరజ 536/600 మార్కులు సాధించిన విద్యార్థినికి 10,000 వేల రూపాయలు, ముక్కావారిపల్లి గ్రామానికి చెందిన వై సతీష్ కుమార్ రెడ్డి 528/600 మార్కులు సాధించిన విద్యార్థికి 5000 వేల రూపాయలు నగదు పురస్కారాలు అందజేసి విద్యార్థులను అబినందించారు. ఈ సందర్భంగా విశాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అప్పుడే చదువు నేర్పిన గురువులకు, హైస్కూల్ కు,తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తెచ్చిన వారవుతారన్నారు. ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలన్నారు. పబ్లిక్ పరీక్షల సమయాలలో ఒత్తిళ్లకు గురికాకుండా చదివిన పాఠ్యాంశాలను గుర్తు పెట్టుకుని పరీక్షలు వ్రాసినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. ఈ సమావేశంలో తెలుగు దేశం పార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసింది జగన్ రెడ్డి

- వీరబల్లి టిడిపి మండల నాయుకులు

విశాలాంధ్ర-వీరబల్లి: నిరుద్యోగులను మోసం చేసింది జగన్మోహన్ రెడ్డి అని మండల టిడిపి నాయకులు గుది నాగార్జున, రాయ వెంకటేష్, తుమ్మల రమేష్, దుర్గం ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో 6 లక్షల మందికి 'నిరుద్యోగ భృతి' ఇస్తే వైసిపి ప్రభుత్వంలోకి రాగానే ఒక్క కలం పోటుతో రద్దు చేసిన జగన్, ఈ రోజు నిరుద్యోగ భృతి ఇంకా ఇవ్వలేదని వైసీపీ ధర్నా అట ...! వైసీపీ మీరున్నప్పుడు ఏమి చేశారు? ఎందుకివ్వలేదు ? వైసీపీ ప్రభుత్వంలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వకుండా, మేము వచ్చి 17 వేల టీచర్ ఉద్యోగులు ఇస్తుంటే, కొన్ని లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు వస్తున్నా కూడా ధర్నా చేస్తుంటే అర్ధమేమిటి? వైసీపీ ప్రభుత్వం చివరి సంవత్సరంలో ఇంజనీరింగ్ ఫీజ్ రీఎంబర్స్మెంట్ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా 3400 కోట్లు బకాయిలు పెట్టేసి వెళ్లిపోయిన వాళ్ళు ఈ రోజు రీఎంబర్స్మెంట్ కోసం ధర్నాలు చేస్తారట, వీళ్ళు చేసిన బకాయిలు టీడీపీ తీరుస్తున్న విషయం మర్చిపోయినట్టున్నారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి అన్నారు.

మనస్తాపంతో విషద్రావం సేవించి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-గాలివీడు: అనారోగ్యంతో మనస్తాపం చెందిన కలపల గోవిందాచారి (59) విషద్రావం సేవించి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు కొర్లకుంట గ్రామం కుమ్మరపల్లెకు చెందిన గోవిందాచారి గాలివీడు పట్టణం గేటు వద్ద నివాసం వుంటూ కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడేవాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యుల సహకారంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటూ జీవితం గడిపేవాడు. అయితే కాలక్రమేనా ఆయన అనారోగ్యంతో మరింత క్షీణించడంతో ఈనెల 19 వ తేదీన జీవితంపై విరక్తి చెంది విషద్రావం తీసుకోవడంతో కొన ఊపిరితో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం గోవిందాచారి మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కలరు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి

- భారీగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- పేదలకు అండగా ఉండే ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు

విశాలాంధ్ర-రాజంపేట: పేదలకు భరోసాగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని, కుటుంబంలో ఆరోగ్య భద్రత కోసం భారీగా ఖర్చు చేసి అనేక కుటుంబాలు అప్పులు పాలై అవస్థలు పడుతున్నారని అలాంటి బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవనిగా ఉపయోగపడుతుందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. సోమవారం జడ ప్రసన్న 8,54,830రూపాయలు, పి.ఇంద్రావతి 4,20,806, ఎల్ సుబ్రహ్మణ్యం రాజు 57,266, సి.చలపతి 41,000, ఈశ్వరమ్మ 1,50,000, నన్నపనేని రామయ్య 40,000, అనిల్ కుమార్ 43541, షేక్ జరీనా బేగం 24346 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ చికిత్స కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని, అలాంటి మాకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధినీ అందించి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, పార్లమెంట్ అధ్యక్షులు జగన్మోహన్ రాజుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టిడిపి పట్టణ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజి టిడిపి అధ్యక్షుడు, బాపనయ్య నాయుడు, క్లస్టర్ ఇన్చార్జులు కొల్లి రెడ్డయ్య నాయుడు పసుపులేటి ప్రవీణ్ కుమార్ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ నాగినేని నాగేశ్వరనాయుడు, టిడిపి ఉపాధ్యక్షులు సతీష్ రాజు, వెంకటేశ్వర్ల నాయుడు, కళాధర్, తాటి సుబ్బరాయుడు, యువ నాయకులు పాండురాజు, పరశురాం నాయుడు, తేజాల ఆనంద్, పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 6, 7, 8, 9 తరగతిలో మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: ఏపీ మోడల్ స్కూల్ లో 6, 7, 8, 9 తరగతిలో మిగిలిన సీట్లకు ఈనెల 24న మంగళ వారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. మిగిలిన సీట్లకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 9 గంటలకు ఏపీ మోడల్ స్కూల్ నందు హాజరు కావాలన్నారు. పరీక్ష అనంతరం మార్కుల మెరిట్ ప్రకారము ఆయా తరగతుల్లో చేర్చుకుంటారని ఆయన తెలియజేశారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా పరీక్షకు హాజరు కావాలన్నారు.

పోరుమామిళ్ల మండలాభివృద్ధే సీపీఐ లక్ష్యం

- సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పోరు మామిళ్ల మండలాభివృద్దే లక్ష్యంగా సీపీఐ పార్టీ పోరాటం సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. పట్టణంలో సోమవారం మహాసభను నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించి అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. సంపద సృష్టించే శ్రమజీవులను విశ్రమించిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని ప్రజా రజక పరిపాలన అందించే పాలకులకు అండగా కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని ఈ దేశంలో సిపిఐ పురుడు పోసుకొని 100ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో రవికుమార్ అధ్యక్షతన పదవ మండల మహాసభ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ పాలకులు మారుతున్న ప్రజల తలరాతలు మారడం లేదని నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో సరైనటువంటి రోడ్లు నీళ్ల కరెంటు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని అందుకే మండల సమగ్ర అభివృద్ధి కోసం ఈ కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించాలని గ్రామీణ ప్రాంతాలలో నెలకొని ఉన్న సమస్యలపై ప్రతి పార్టీ సభ్యుడు ఉద్యమించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన కోరారు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి శాఖ నుండి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుగుతాయి. ఈ మహాసభలు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని పోరాటాల కు సన్నద్ధం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, కార్యవర్గ సభ్యులు, పివి రమణ, కోడూరు కేశవ, బాలు, పివి రమణ, సఫా, పేరయ్య, చెన్నయ్య, ఫిరోజ్, నాగరాజ్, ప్రసాద్, సునీల్, నాగేశం, ఇమ్మానియేల్, అధిక సంఖ్యలో మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు అందరు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-బద్వేలు: బద్వేల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 65లక్షల మంది ఆటో డ్రైవర్ ఉంటే ఆటో డ్రైవర్లు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను గమ్య స్థలానికి చేరవేస్తూ ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్న ఆటో డ్రైవర్లకు పిఎఫ్ ఈఎస్ఐ పెన్షన్తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీగా జరిమానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21, 31రద్దు చేసి డ్రైవర్ కల్పించాలని కోరారు. డీజిల్ పెట్రోల్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 30శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో స్టాండ్లు, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్బి రోడ్లలో టోల్ గేట్లు పెట్టాలన్న ప్రభుత్వం ప్రతిపాదన నిర్మించాలి. ప్రమాదకరంగా ఉన్న రోడ్లు పక్కాగా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ సెండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కార్యదర్శి నాగేంద్ర, అధ్యక్షులు చిన్న వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, నాయకులు బాబు, నరసింహులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించేంత వరకు పోరు: సిపిఐ

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి 10వేల కోట్లు నిధులు కేటాయించాలని సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా ఎటువంటి పురోగతి లేదని, పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. హంద్రీనీవా కాలువ పనులు వెంటనే పూర్తి చేసి అందులో అంతర్భాగమైన వెలిగల్లు ప్రాజెక్టు, శ్రీనివాసపురం రిజర్వాయర్, ఝరికోన కాలువలు పూర్తిచేసి రైతాంగానికి తాగునీరు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రాయచోటి కేంద్రంలో రైతాంగానికి అవసరమైన కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ ఉంచుకునేందుకు వీలుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పీలేరు నియోజకవర్గం కార్యదర్శి టియల్ వెంకటేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి జగన్ బాబు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు హరినాథనాయుడు, అంజాద్ అలీ ఖాన్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్నదాత సుఖీభవ సహాయాన్ని అందించాలి

- ఏఐకేఎస్ వైయస్సార్ కడప జిల్లా సమితి డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్: రైతులకు అన్నదాత సుఖీభవ సహాయాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం దగ్గర డికెటి, చుక్కల భూములు, కౌలు రైతులకు సాగు సహాయం అన్నదాత సుఖీభవ అందించాలని ధర్నా చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడుకి అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ డీకేటి రైతులు దళిత, బడుగు, బలహీన, అగ్రవర్ణ పేదలకు సంబంధించిన వారని, వారిని అన్నదాత సుఖీభవ పథకం నుండి తొలగించడం అన్యాయమని, చుక్కల భూముల, కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, రైతు సంఘం జిల్లా కార్యనిర్వహిత అధ్యక్షులు మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బాల చంద్రయ్య, సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు రామాంజనేయులు రెడ్డి, గోశెట్టి రామ్మూర్తి, భాస్కర్రెడ్డి, సుబ్బారెడ్డి, బాలసుబ్బయ్య, జయంత్, నాయకులు షావలి, వీరయ్య, శేఖర్, ఎల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: వాల్మీకిపురం బీజేపీ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పులి నరేంద్రకుమార్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, విష్ణు, చైతన్య, నవీన్, ప్రసాద్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి రామాలయ అభివృద్ధికి పరిశీలన

విశాలాంధ్ర-వాల్మీకిపురం: తితిదే ఆధ్వర్యం లోని వాల్మీకి క్షేత్ర పట్టాభిరామాలయ సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం తితిదే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. వాల్మీకిక్షేత్ర పట్టాభిరామాలయ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్కుమార్ రెడ్డి తితిదే ఛైర్మన్, ఈవోలను ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందించారు ఎమ్మెల్యే అభ్యర్థనను పరిగణలోకి తీసుకున్న తితిదే ఛైర్మన్, ఈవోలు రామాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించేందుకు ప్రత్యేక అధికారుల బృందాన్ని పంపారు. తితిదే ఎస్ఈ మనోహర్తో పాటు అధికారుల బృందం ఈఈ జగన్మోహన్ రెడ్డి, డీఈ సర్వేశ్వర్, ఏఈ రవి, సపతి కృష్ణారావులు సోమవారం పట్టాభిరామాలయంలో పాటు రామాలయ అనుబంధ ఆస్తులను పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించారు తొలుత రామాలయంలో దక్షిణమాడవీధిలోని రాజగోపురం పునః నిర్మాణంతో పాటు గరుడుపుష్కరిణి, ఆలయంలో చిన్నచిన్నమరమ్మత్తులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, పార్వేట మండపానికి మరమ్మత్తులు, అనంతపురం-నాయుడుపేట ఎక్స్ప్రెస్ హైవే నుంచి వాల్మీకిపురంకు వచ్చే రహదారిలో ఆర్చీ నిర్మాణం, రథానికి శాశ్వతరక్షణ కవచం, మదనపల్లె తిరుపతి జాతీయరహదారికి ఆనుకుని ఉన్న తితిదే స్థలంలో పాదచారులకు విశ్రాంత భవనాలు, వసతిగృహాలు, ప్రస్తుతం ఉన్న తితిదే కళ్యాణ మండపం ప్రస్తుత స్థాయిని రెండింతలు పెంచేపనులుచేపట్టడం, ఆరుబయట కళ్యాణమండపం స్థలంలో శాస్వత కళ్యాణ మండపంతో పాటు షెడ్ల నిర్మాణం.. పచ్చదనం పెంచడం తదితర కార్యక్రమాలను చేపట్టాలని తితిదే అధికారులు గుర్తించి తితిదే ఛైర్మన్, ఈవోకు ప్రణాళికలు పంపానున్నట్లు తెలిపారు వారి ఆమోదం రాగానే అభివృద్ధి పనులు చేపట్టి, పట్టాభిరామాలయ అభివృద్ధిని పూర్తి స్థాయిలో చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, మాజీ సర్పంచి రాజేంద్రచారి, తెదేపానాయకులు కోసూరి రమేష్, మురళి, తితిదే అధికారులు, రామభక్తులు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-వాల్మీకిపురం: వాల్మీకిపురం మార్కెట్ కమిటీ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం, చింతపర్తి మార్కెట్ యార్డులు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ సమావేశ భవనంలో నూతన పాలక మండలి సభ్యుల ఎన్నిక అనంతరం తొలిసారిగా సమావేశమయ్యారు. సమావేశానికి హాజరైన మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కిషోర్కుమార్ రెడ్డి సహకారంతో మార్కెట్ యార్డులు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామన్నారు. డైరెక్టర్ సహాయ సహకారంతో యార్డులకు ఆదాయ వనరుల సేకరణపై దృష్టి సాధిస్తామన్నారు. మార్కెట్ యార్డులో ఉన్న నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించి వాటి ద్వారా ఆదాయ మార్గాలను అన్వేషిస్తామన్నారు. భవిష్యత్తులో చేపట్టే కార్యకలాపాలపై పాలకమండలి చర్చించింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నౌషాద్ డైరెక్టర్లు కాంతరాజు శెట్టి, శ్రీనివాసులు, సుధా, భావజాన్, రాధా, జయభారతి, తాహిర్, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-అట్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అలాగే జీవో నెంబర్ 5కి వ్యతిరేకంగా 'జీవో నెంబర్ 5ను సవరించి, సర్వీస్ రూల్స్, ప్రమోషన్ ఛానల్, నేషనల్ ఇంక్రిమెంట్స్, మంజూరు చేయాలని, అలాగే రెగ్యులైజేషన్, మిగులు సిబ్బందిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, అలాగే సొంత మండలంలో సొంత మున్సిపాలిటీలలోనే బదిలీలకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్త పరుస్తూ సోమవారం అట్లూరు తాసిల్దార్ సుబ్బలక్షుమ్మకు, డిప్యూటీ తాసిల్దార్కు, మండల సర్వేయర్ కు వినతి పత్రం అందజేశారు. జీవో నెంబర్ 5 వల్ల సచివాలయ ఉద్యోగులకు నష్టం వాటిల్లేగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, అశోక్, తేజ, మౌనికలు పాల్గొన్నారు.

కాలం మారింది.. వేరుశనగ పంటకు మంగళం

మొదటి పేజీ తరువాయి

వస్తుంది. ముఖ్యంగా వేరుకుళ్లు తెగులు సోకుందని, గతంలో ఇదే పరిస్థితి ఎదురుకావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు పేర్కొన్నారు. అందుకే పత్తిని ప్రధాన పంటగా వేసినట్లు రైతులు వెల్లడించారు. గతంలో గ్రాసం కోసం వేరుశనగ సాగు చేసేవారు. ప్రస్తుతం పశుసంపద కూడా గ్రామీణ ప్రాంతాల్లో గణనీయంగా తగ్గింది. యాంత్రిక జీవనంపై ఆధారపడిన రైతులు వాటి గురించి ఆలోచించే స్థితిలో లేరు. దీన్ని బట్టి వేరుశనగసాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటలో రైతులు కుస్తీ పట్టనున్నారు. ఈ పరిణామ క్రమంలో దీర్ఘకాలికంగా పత్తిపంట వేస్తున్నారు. రైతులు మాట్లాడుతూ వేరుశన పంటకు విపరీతమైన ఖర్చు రావడం, దిగుబడి దశలో ధర గిట్టుబాటు లభించకపోవడంతో పత్తింట వైపు మొగ్గు చూపామన్నారు. బాగా కాపు వస్తే ఎకరాల 10 నుంచి 15క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం పత్తి క్వింటా ధర రూ.7వేల నుంచి రూ.9వేల వరకు ఉన్నాయి. దిగుబడి ఇళ్ల చేరే నాటికి మరింత ధర వస్తే తమకు పూర్తిగా ఉపశమనం లభిస్తుందని రైతులు తెలిపారు.

డ్రోన్ ద్వారా సస్యరక్షణ చర్యలు

విశాలాంధ్ర -పులివెందుల: డ్రోన్ పరికరం ద్వారా సస్య రక్షణ చర్యలు చేపట్టవచ్చని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టరు వంగల శశిభూషణరెడ్డి అన్నారు. సింహాద్రిపురం రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం ఇయన డ్రోన్ పరికరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగంలో విప్లవాత్మకమార్పులు చోటుచేసున్నాయన్నారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా తెగుళ్ల నివారణకు డ్రోన్ పరికరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సస్యరక్షణ చర్యల్లో భాగంగా రోజుకు 20ఎకరాలు చొప్పున పిచికారి చేసేందుకు వీలుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కళ్యాణ్‌కుమార్, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి, మండల నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రైతు సేవా సెంటర్ దీపిక,, యూనియన్ బ్యాంక్ క్షేత్రస్థాయి అధికారి అరవింద్, రైతులు పాల్గొన్నారు.

త్యాగయ్య చిరస్మరణీయులు

విశాలాంధ్ర -వేంపల్లి: సంగీత సాహితీ రసజ్ఞుల హృదయాలల్లో త్యాగయ్య చిరస్మరణీయులని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి కీర్తించారు. వేంపల్లిలో సోమవారం నిర్వహించి త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవంలో మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగరాజ స్వామి కర్నాటక,శాస్త్రీయ సంగీతానికి మూల స్తంభం అన్నారు.త్యాగయ్య భూలోక నారద మహర్షి అని కీర్తించారు. శ్రీరామునికి నిజమైన భక్తుడు.96 కోట్ల సార్లు రామ నామం జపించాడు. నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా? అంటే రాముని సన్నిధి సేవ సుఖం అన్నారు .భక్తిలో ప్రహ్లాదుడు,వైరాగ్యంలో శుకుడు, గానంలో నారదుడు, సాహిత్యంలో విద్యావతి వంటి వాడు త్యాగయ్య అని తులసి రెడ్డి శ్లాఘించారు. 24 వేల కృతులు రచించి 205 రాగాలు సృష్టించారని తెలిపారు. తెలుగు భాషకు వన్నె తెచ్చారని సంగీత సాధన ద్వారా మోక్ష ప్రాప్తి పొందారని ప్రతీతి.అని కొనియాడారు. సంగీత, సాహిత్య రసజ్ఞుల హృదయాలలో త్యాగయ్య చిరంజీవిగా వున్నారని తులసి రెడ్డి శ్లాఘించారు. కార్యక్రమంలో రత్నమయ్య, రామ కృష్ణ, రామాంజనేయులు, రవీంద్రనాథ రెడ్డి, బండారు వెంకటేష్, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్నరాజు, మాబు తదితర త్యాగరాజ స్వామి భక్తులు పాల్గొన్నారు.

చీనీ రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

గిట్టుబాటు ధర కల్పించేందుకు బిటెక్ రవి కృషి

సమస్యను సానుకూలంగా పరిష్కరించుకుందాం

టిడిపి సీనియర్ నేత వెంకటరామిరెడ్డి

విశాలాంధ్ర -పులివెందుల: చీనీ రైతులకు కూమి ప్రభుత్వం ఉండగా నిలుస్తుందని ఆ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి స్పష్టంచేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చీనీ రైతులకు సంబంధించిన వివరాలను వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించే దదుకు టిడిపి ఇన్చార్జి బిటెక్ రవి కృషి చేస్తారన్నారు. సమస్యను సానుకూలంగా పరిష్కరిం చుకునేందుకు అందరూ కలిసిరావాలని ఆయన కోరారు. ఇటీవల కాలంలో చీనీకాయల ధరలు పడిపోతుండటం బాధిస్తుందన్నారు. వ్యయ ప్రయాసాలకు ఓర్చి కంటికి రెప్పలా కాపాడుకుని చివరకు దిగుబడి దశలో ధరలేకపోతే ఆ రైతు బాధ వర్ణనాతీతమన్నారు. బయల ప్రాంతంలో టన్ను రూ.50వేలకు పైగా పలుకుందని, ఇక్కడ మార్కెట్‌లో టన్ను రూ.40వేలకు మాత్రమే ఉందని, ఇలా ఒక్కసారిగా ధర ఎందుకు తగ్గిందో తనకు అర్థంకాలేదన్నారు. ఇక్కడ వ్యాపారులు, అధికారులపై చీనీ రైతులకు కొంత అపనమ్మకం ఉందన్నారు. ఈ అపనమ్మకాన్ని తొలగించేందుకు వచ్చే ఆదివారం సెలవుకావడంతో అందరూ ఒక చోట కలుసుకుని సమస్యను తాను లేదా బిటక్ రవి సమక్షంలో పరిష్కరించుకుందామన్నారు. అపోహలు ఉంటే అన్ని విధాలా నష్టమన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్ అభివృద్ధి చెందాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. రైతులు కూడా నెలలు కష్టపడి సాగుచేసి పండించిన చీనీకాయలను ఒక్కరోజు ఓపికతో గ్రేడింగ్ చేస్తే ఊరట ఉంటుందన్నారు. అప్పుడు ధర కూడా అడిగే హక్కు రైతులకు ఉంటుందన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించాలని ఆయన కోరారు. మార్కెట్‌పై నెలకొన్న అపోహలు తొలగించి వారి సందేహాలకు నివృత్తి చేసేందుకు తాను ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించిన మార్కెట్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యను సానుకూల వాతావరణంలో కూలంకషంగా చర్చించి వాటి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు ఆదివారం మార్కెట్ సిబ్బంది, వ్యాపారులు, రైతులు కలిసి రావాలని ఆయన విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సారెడ్డి గంగాధర్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, కులశేఖర్‌రెడ్డి, చీనీ వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీకే ప్రాధాన్యం

ప్రభుత్వ పెద్దలపై వ్యతిరేక పోస్టులు పెట్టిన వ్యక్తికి కరెంట్ మీటర్

విపక్ష వ్యక్తికి విద్యుత్ కనెక్షన్ -అయోమయంలో కూటమి శ్రేణులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే తమకు అధిక ప్రాధాన్యత లభిస్తుందని నిన్నమొన్నటి వరకు విపక్షంలో కొనసాగిన టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు భావించాయి. అయితే అందుకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలకే పనులు జరుగుతున్నాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. కూటమికి చెందిన కొంతమంది చోటా నాయకులు తమ బంధువులు, స్నేహితుల పేరిట వెంట తీసుకెళ్లి నేతల ద్వారా వారికి అవసరమైన పనులు చేయిస్తున్న సంఘటనలతో కూటమి పార్టీల కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఎన్నికల ఫలితాల వరకు వైసీపీ వెంట నడిచిన వ్యక్తులు నేడు కూటమి కార్యక్రమాలలో దర్శనమిస్తూ వారి వ్యక్తిగత ప్రయోజనాలు నెరవేర్చు కుంటున్నారని కొందరు గుర్తుచేస్తున్నారు. కూటమికి చెందిన పలువురు ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల్లో సైతం వైసీపీ సానుభూతిపరులుగా గుర్తింపు పొందిన వారికి సిఫారసులు చేసినట్లు ప్రచారం ఉంది. ఒక చౌకదుకాణం వ్యవహారంలో కూటమికి చెందిన ఒక వ్యక్తి సిఫారసు కారణంగా వైసీపీకి చెందిన వ్యక్తికే ఆ దుకాణం దక్కడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. అలాగే కడప రోడ్డులోని ఓ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద గాలి మిషన్ (పంక్చర్ దుకాణం)కు అవసరమైన విద్యుత్ సరఫరాకు ఏర్పాట్ల వ్యవహారంలో కూడా కూటమికి చెందిన ఒక వ్యక్తి చొరవ చూపి వైసీపీకి చెందిన సదరు వ్యక్తికి లబ్ది చేకూర్చినట్లు తెలుస్తోంది. సదరు గాలి మిషన్ నిర్వాహకుడు కమలాపురం మండలానికి చెందిన వ్యక్తి. ఇతను కూటమి ప్రభుత్వం, సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండడాన్ని స్థానిక కూటమి కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు. సదరు పోస్టులను కూటమి కార్యకర్తలు సాక్ష్యాలతో నిరూపిస్తున్నారు. ఈ వ్యవహారంలో చొరవ చూపిన పురపాలికలోని ఓ వార్డు కూటమి ఇన్‌చార్జిగా తనకు తానే ప్రచారం చేసుకుంటుండడాన్ని కార్యకర్తలు గుర్తుచేస్తూ ఇన్‌చార్జిల నియామకం ఎప్పుడు జరిగిందోసంటూ గందరగోళానికి గురవుతున్నారు. కూటమి పార్టీలను, ప్రభుత్వ పెద్దలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్న ఇలాంటి వారికి పనులు చేయడం ఎంత వరకు సమంజసమంటూ కూటమి శ్రేణులు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి విషయాలు తెలియక మండల, నియోజకవర్గ స్థాయి నేతలు కూటమికి చెందిన చోటా నాయకుల సిఫారసులను పరిగణలోకి తీసుకుంటుండడం కూటమి శ్రేణుల్లో చర్చకు దారితీస్తోంది. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నిజమైన కార్యకర్తల ప్రయోజనాల కోసం అధినాయకులు చర్యలు తీసుకుంటే ఫలితం ఉంటుందని శ్రేణులు భావిస్తున్నాయి.

పాలకులు ఓట్లు సీట్లు తప్ప జిల్లా అభివృద్ధి పట్టదా ?

జిల్లా అభివృద్ధికి జిల్లాలో అన్ని ఉన్న అభివృద్ధి మాత్రం శూన్యం - జిల్లాలో పరిశ్రమలు మూతపడడమే తప్ప నూతనంగా వచ్చినవి లేవు

జిల్లా సమగ్ర అభివృద్ధికి పాలక ప్రభుత్వం 10వేల కోట్లు కేటాయించాలి - పాలక పార్టీ నాయకులు జిల్లా అభివృద్ధి కోసం తోడ్పాటు అందించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా

విశాలాంధ్ర -రాజంపేట: ఆంధ్రప్రదేశ్ లో గతంలో ఉన్నటువంటి 13 జిల్లాలను 26 జిల్లాలుగా గత ప్రభుత్వం చేయడం జరిగినది. అందులో చిత్తూరు జిల్లా నుండి మూడు నియోజకవర్గాలు కడప జిల్లా నుండి మూడు నియోజకవర్గాలు కలిపి నూతన అన్నమయ్య జిల్లాగా ఏర్పాటు చేశారని ఈ జిల్లా సమగ్ర అభివృద్ధి పాలక ప్రభుత్వాలకు పట్టవా అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సోమవారం ఉదయం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలు ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మహేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుమ్మల రాధాకృష్ణ లు మాట్లాడుతూ ఈ 6 నియోజకవర్గాలు ఎటువంటి అభివృద్ధి లేక ఉపాధి అవకాశాలు లేక చదువుకున్న యువత విదేశాలలో వెట్టిచాకిరి వైపు మరికొంతమంది చెడు మార్గాలలో ఉంటున్నారు. ఈ నూతనంగా ఏర్పడినటువంటి అన్నమయ్య జిల్లాలో సహజ వనరులు, హార్టికల్చర్, విహార ప్రదేశాలు చాలా ఉన్నప్పటికీ అభివృద్ధికి మాత్రం చాలా దూరంలో ఉన్నదని. ఈ జిల్లాలో గతంలో నందలూరులో ఉన్నటువంటి రైల్వే ఆల్విన్ పరిశ్రమలు, కోడూరు లోని అప్పా జ్యూస్ పరిశ్రమ సిటిఎం స్పిన్నింగ్ మిల్ ,వీలేరులో నూనె విత్తల కర్మాగారం జిల్లాలో చాలా ప్రాంతాలల్లో పాల పరిశ్రమలు మూతపడ్డాయి ఇవన్నీ మూతపడడం ద్వారా వేలాది మంది కార్మికులు ఆ పరిశ్రమల ఆధారంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నటువంటి అనేకమంది కూడా ఉపాధిని కోల్పోయారని. నీటిపారుదల ప్రాజెక్టులు గత మూడు దశాబ్దాలుగా రైతులను ఊరిస్తున్నటువంటి గాలేరు నగరి కి నిధులు కేటాయింపు లేక అది పూర్తి కాక రైతులకు నీరు పుష్కలంగా అందడం లేదు, దానితోపాటు హంద్రీనీవా ప్రాజెక్టు పనులు నత్తనడక గా నడుస్తుంది, మరోవైపు ఇసుకాసురుల ధన దాహానికి వరద పాలైపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం ఇంకా నిపుణుల కమిటీ పేరుతో కాలయాపన జరుగు తున్నదని. దాని ప్రభావం సుమారు నాలుగు మండలాల రైతులకు నీరు అందక బోర్లు ఎండిపోతు పంటలు పండించే పరిస్థితి లేకుండా పోతున్నాయి. అలాగే వెలిగల్లు ప్రాజెక్టు నిర్మాణం అయినప్పటికీ నీరు ఎవరికీ ఉపయోగపడడం లేదని కుడి ఎడమ కాలువలు పూర్తికాక రైతులకు నీరు అందడం లేదని, జురికోన ప్రాజెక్టు పరిస్థితి అలాగే ఉన్నది ఇంకా చిన్న చిన్న ప్రాజెక్టుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నాయి. మరోవైపు గతంలో కడప బెంగళూరు రైల్వే లైన్ కడప నుండి పెండ్లిమర్రి మీదుగా లక్కిరెడ్డిపల్లి,రాయచోటి పీలేరు మదనపల్లి కలుపుతూ అలైన్మెంట్ తయారు చేస్తే గత పాలకవర్గం అలా కాదని ముద్దనూరు మీదుగా వేయాలని ప్రతిపాదనలు చేసి ఆ రైల్వే లైన్ లేకుండా చేయడం జరిగిందని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ రాష్ట్రంలో దేశంలో కూడా మీ యొక్క కూటమి ప్రభుత్వాలే ఉన్నవి కావున పాత అలైన్మెంట్ ప్రకారం రైల్వే లైన్ నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సిజి చెన్నయ్య కాంగ్రెస్ పార్టీ రాజంపేట ఇన్చార్జ్ పూల భాస్కర్ కోడూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గోశాల దేవి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గంగాధర్ సహాయ కార్యదర్శి మురళి ఈ సికిందర్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజ నమ్మ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు,బి కె యం యు జిల్లా ఉపాధ్యక్షులు జయరాం సిపిఐ మండల కార్యదర్శులు నాగమ్మ, ఆదినారాయణ, సెల్వ కుమార్, పార్టీ ప్రజా సంఘాల నాయకులు పరమయ్యగారి సుబ్రహ్మణ్యం,రమణ పెంచలయ్య జమాల్ భాషా,సాయి,వెంకటేష్,బాబాజాన్ లక్ష్మీనారాయణ శివయ్య రాజశేఖర్ వెంకటరమణ రోజమ్మ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు పంపిణీ

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక సుందరాచార్య వీధిలోని మున్సిపల్ పార్క్ ప్రైమరీ స్కూల్ మరియు ముస్లిం పుర ఉర్దూ స్కూల్ నందు మున్సిపల్ వైస్‌చైర్మెన్ సీఎస్ ఖాజా ప్రభుత్వం ఇచ్చిన బ్యాగులు, యూనిఫాం, టెక్ట్స్‌బుక్స్‌తో పాటు ఆయన ప్రతి ఏటా తన సొంత నిధులతో నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సంవత్సరం కూడ ఆయన తన సొంత నిధులతో నోటు పుస్తకాలు అందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇద్రీస్, గైబుసా, కరీముల్లా, ఖదీర్, టిప్పు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాపై అలసత్వం వద్దు: కమీషనర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : బదిలీపై ఇక్కడికి వచ్చిన అనిమిటీస్ ఇంజనీర్లతో సోమవారం మున్సిపల్ కమీషనర్ శేషఫణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ నీటి సరఫరాపై వారికి సలహాలు, సూచనలు చేశారు. పట్టణ ప్రజలకు సంబంధించి నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించరాదని శేషఫణి సూచించారు. తాగునీటి అంశంలో జాగ్రత్తలు తీసుకుంటూ పైపులైన్ల లీకేజీల సందర్భాల్లో ఎప్పటికప్పుడు వాటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని శేషఫణి వారికి సూచించారు.

రోడ్డెక్కిన గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామవార్డ్ సచివాలయాల సిబ్బంది సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్దనుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డ్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులకు గెజిటెడ్ ఉద్యోగ స్థాయి నిబంధనల, ప్రమోషన్ లేకుండాబదిలీల, వార్డు నుంచి మరో వార్డుకు బదిలీలకు అవకాశం కల్పించాలనీ మాకు రావలసిన రెండు సంవత్సరాల నేషనల్ ఇంక్రిమెంట్లు 9 నెలల అరియర్స్ ఇవ్వాలని ఇప్పటికే పిల్లల స్కూలు చేర్పించేసామని బయట ప్రాంతాలకు వెళ్లి 30 వేల జీతంలో అవస్థలు పడవలసి వస్తుందని సొంత మండలాల్లో అవకాశం కల్పించాలని వారుమున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో పట్టణంలోని వార్డ్ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువత పోరుకు భారీగా తరలిన యువకులు

విశాలాంధ్ర-చెన్నూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెన్నూరు మండల యూత్ వింగ్ అధ్యక్షుడు పేరు సాముల నిత్యపూజయ్య ఆధ్వర్యంలో భారీగా యువత తరలి వెళ్లారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి ఆదేశాల మేరకు తామంతా యువత పోరు కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలి వెళ్లినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూత్ వింగ్ మండల ఉపాధ్యక్షుడు రామకోటి రెడ్డి, సెక్రటరీ సాయినాథ్ రెడ్డి, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు,దేవగుడి భాస్కర్ రెడ్డి, టి ఎన్ చంద్రారెడ్డి, వెంకట కృష్ణ, సాయి పవన్ కుమార్ రెడ్డి (పండు భాయ్), ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పార్థసారథి, బ్రహ్మయ్య, శివరాం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

యువతను దగా చేసిన కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని యువత, విద్యార్థులు తరలి వచ్చి హామీలిచ్చి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్ఆర్ సిపి యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో యువత పోరు చేపట్టారు. అనంతరం ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ డిఆర్ఓకు యువత, విద్యార్థి విభాగాల నాయకులు వినతి పత్రం సమర్పించారు.

బనకచర్ల కంటే ముందు

హంద్రీనీవా, వంశధారలను పూర్తి చేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారిన బనకచర్ల ప్రాజెక్టుపై కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు రాలు విజయ జ్యోతి స్పందించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందు హంద్రీనీవా, వంశధార లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరికి నష్టం లేని పద్ధతిలో పరిష్కారం చేసుకుంటే మంచిదని విజయ జ్యోతి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, పులివెందుల, కమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్లు ధ్రువ కుమార్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్, కేకేసి జిల్లా ఉపాధ్యక్షులు ఫైరోజు హుస్సేన్, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నీలం, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ భాష, సిద్ధిక్ పాల్గొన్నారు.

దోమకాటు - ఆరోగ్యానికి చేటు

విశాలాంధ్ర-పులివెందుల: దోమకాటు ఆరోగ్యానికి చేటని వైద్యులు స్రవంతి, ప్రత్యూషలు పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా సింహాద్రిపురం మండలంలోని కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఈ అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలకు దోమకాటు వల్ల కలిగే వ్యాధులపై - ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులుపై అవగాహన కల్పించారు. దోమల వృద్ధిని అడ్డుకునే మార్గాలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచే విధానాలు, నీటి నిల్వలను తొలగించడం, దోమతెరాల వాడకంపై వివరంగా తెలియజేశారు. ప్రత్యేకంగా గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఇలాంటి వ్యాధులకు అత్యధికంగా గురికావచ్చునని, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు వివరంగా సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్. సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి ఖాదర్ భాషా, హెల్త్ సూపర్వైజర్ ఖలీల్ భాషా, పద్మావతమ్మ, రాధ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రావణి మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భారీ ఎత్తున వైసీపీ యువత పోరు

:పెద్దిరెడ్డి ద్వారకానాధ రెడ్డి

విశాలాంధ్ర- పీలేరు: కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారీ సంక్షేమ ర్యాలీ వైయస్ఆర్ యువజన విభాగంఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందని వైసీపీ రాష్ట్ర ప్రచారా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ రెడ్డి,పీలేరు, కెవి. పల్లి మండలాల వైస్సార్సీపీ యువజన నాయకులు సుంకర చక్రధర్ (చక్రి), పెద్దిరెడ్డి ద్వారకానాధ రెడ్డి లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్, నిరుద్యోగ భృతి బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించడం జరిగిందని తెలిపారు.కూటమిప్రభుత్వం సంక్షేమన్ని, పూర్తిగా విస్మరించిదని వారు ద్వజం ఎత్తారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కు వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు వినతిపత్రం సమర్పించారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళులు

విశాలాంధ్ర - సుండుపల్లె : శామా ప్రసాద్ ముఖర్జీని స్మరించుకుంటూ సుండుపల్లె మండల కేంద్రంలో మహనీయుని చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు రమణాగౌడ్ ఆద్వర్యంలో ఘనంగా నివా ళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహనీయుడు దేశం కోసం ఆర్టికల్ 370 తొలగింపు కోసం ప్రాణ త్యాగాన్ని ఈ సందర్భంగా తెలుపుతూ స్వతంత్ర భారత రాజకీయాకాశంలో సిద్ధాంత రహిత రాజకీయాలు చేసారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రెడ్డి రాజాచారి, కార్యదర్శి వెంకటరమణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరించాలని అంగన్వాడీలు నిరసన

విశాలాంధ్ర-రాయచోటి: అంగనవాడీల రాష్ట్రవ్యాప్త ధర్నాలో భాగంగా సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద సిఐటియూ ఆధ్వర్యంలో చేపట్టిన అంగన్వాడీల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీ లక్ష్మి, రాజేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, కోశాధికారి బంగారుపాపలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటిన అంగన్వాడి జీవితాల్లో జీతాల్లో మార్పు రాలేదని, ముఖ్యంగా సమ్మె కాలపు హామీలు అమలు చేయలేదని అన్నారు. సకాలంలో నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని, పెండింగ్ జీతాలు, బిల్లులు తక్షణమే ఇవ్వాలని, దహన సంస్కారాలు ఖర్చులు ఇవ్వాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ 2047 పేరుతో ఆంధ్రప్రదేశ్ ను స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్ గా మారుస్తానని చెబుతున్నారని, కానీ అంగన్వాడీలకు గత సమ్మెలో కుప్పం వేదికగా అంగన్వాడిల సమస్యలు పరిశీలిస్తానని చెప్పి కేబినెట్ మీటింగ్లో మినీ సెంటర్లోని మెయిన్ సెంటర్‌లు గా మారుస్తానని నిర్ణయించి అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, కనీస వేతనం 26 వేల కొరకు జూలై 9 న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. అనంతరం డిఅర్ఓ సమక్షంలో పిడితో జరిగిన జాయింట్ సమావేశంలో అంగన్వాడీ సమస్యలన్ని పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల : వైసీపీ ఎర్రగుంట్ల మండల పర్యవేక్షకులు, మాజీ ఎమ్మెల్యే డా.సుధీర్ రెడ్డి సోదరుడు దివంగత మూలె సురేంద్రనాథ రెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక రైల్వేగేటు సమీపంలోని నిరాశ్రయుల ఆశ్రమం, తిప్పలూరు గ్రామం వద్ద ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ అనాధ ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. సురేంద్రనాథరెడ్డి కుటుంబసభ్యులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భగవంతుని సన్నిధిలో సురేంద్ర నాథరెడ్డి ఆత్మకు శాంతికలగాలని ఈ సందర్భంగా నిరాశ్రయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసీపీకి చెందిన మల్లు కేశవరెడ్డితో పాటు పలువురు శ్రేణులు పాల్గొన్నారు.

డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డికి సత్కారం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం పాలకమండలి సభ్యునిగా నియమితులైన డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డిని మురుకూటి డా.సూర్యనారాయణ రెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్థానిక శివాలయంలో మురుకూటి డా.సూర్యనారాయణ రెడ్డి సేవాట్రస్టు అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి మరియు సభ్యులు డా.వరుణ్‌కుమార్ రెడ్డికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ డా.వరుణ్‌కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు స్వీకరించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

పోరుబాట కార్యక్రమానికి తరలిన యువత

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాడు యువతకు మద్దతుగా ఛలో కడప కలెక్టరేట్‌కు భారీ సంఖ్యలో యువత, వైకాపా నాయకులు, మద్దతుదారులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువజ విభాగం నియోజికవర్గ అధ్యక్షులు గురునాథ్ రెడ్డి, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు మోడెమ్ సందీప్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి పేరం సుమన్ రెడ్డి, జిల్లా యువజన విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలాజి నివాస్, ప్రొద్దుటూరు మండల యువజన విభాగం అధ్యక్షులు రామాంజనేయ రెడ్డి, రాజుపాళెం మండల యువజన విభాగం అధ్యక్షులు యోగానంద రెడ్డి, ప్రొద్దుటూరు నియోజికవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు బాషా, ప్రొద్దుటూరు యువజన ఉపాధ్యక్షులు సంతి, ప్రొద్దుటూరు నియోజికవర్గ స్టూడెంట్ యూనియన్ వింగ్ అధ్యక్షుడు దావూద్, వైకాపా నాయకులు వెలవలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు, వయోవృద్ధులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కూటమి ప్రభుత్వం రేషన్ డీలర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి వయోవృద్ధులకు మరియు దివ్యాంగులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని, ఆయా వార్డు మరియు గ్రామ సచివాలయాల అధ్వర్యంలో పర్యవేక్షణలో వీఆర్వోల సహకారంతో నిర్లక్ష్యం వహించకుండా అర్హులైన అందరికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షాకీర్ హుస్సేన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ అర్హులైన వయోవృద్ధులకు మరియు దివ్యాంగులకు రేషన్ డీలర్ల ద్వారానే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా రేషన్ సరుకులు డీలర్ల ద్వారా అందించే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవాసమితి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, వెంకటలక్ష్మి, జ్యోతి, ఎద్దు సుబ్బరాయుడు, కమ్మగిరి రాముడు, ఆఫీస్ రహమతుల్లా, దివ్యాంగులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో

సాఫ్ట్వేర్ ఇంజనీర్‌ను ఇరికించిన వైసీపీ నాయకుడు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ : గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రచారం చేసి ఓట్లు వేసి, వేయించారని ఒక సాఫ్ట్వేర్ ఇంజనీర్ ను ఒక మహిళను రెండు కాళ్లు రెండు చేతులు లేని దివ్యాంగుడుని ఒక మైనర్ బాలిక ఆత్మహత్య కేసులో వైసీపీ నాయకుడు మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి తన అనుచరుల చేత అక్రమంగా ఇరికించి జైలు పాలు చేశారని బాధిత కుటుంబ సభ్యులు సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీని కలిసి వారి గోడు వెళ్లబోసుకున్నారు. ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండలం మిట్టవాండ్లపల్లి చెందిన చంద్రగిరి సృజన (15) అనే మైనర్ బాలిక వారి ఇంట్లోనే ఉరివేసుకొని ఈనెల 11న ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. మిట్టవాళ్లపల్లె రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి స్వగ్రామము. దశరథ రామిరెడ్డి వైసీపీకి సపోర్ట్ చేస్తుండగా టిడిపి గ్రూపుకు సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా ఉన్న యువకుడు జెడిపిటి తారకనాథ్ (23) గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి, వేయించారు. తనకు వ్యతిరేకంగా గ్రామంలో ప్రచారం చేస్తారా అని కక్ష కట్టిన దశరథరామిరెడ్డి అవకాశం కోసం ఎదురు చూశారని, తన వర్గానికి చెందిన సృజన అనే మైనర్ బాలిక ఈనెల 11న ఆత్మహత్యకు పాల్పడిన కేసును అవకాశంగా తీసుకుని సాఫ్ట్వేర్ ఇంజనీర్ అయిన తమ కుమారుడు తారకనాథ (23)ను మైనర్ బాలిక ఆత్మహత్య కు కారకులని కేసులో ఇరికించి జైలు పాలు చేసి తమ కుమారుడి జీవితాన్ని నాశనం చేశారని అతని తల్లిదండ్రులు ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. తమకుమారుడుతో పాటు రెండు కాళ్లు రెండు చేతులు పని చేయని దివ్యాంగుడైన దేవపట్ల వెంకటస్వామి తెలుగుదేశం పార్టీ మద్దతు రాలైన రేపన రాణి (25) లను జైలు పాలు చేశారని వారు ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తప్ప తమ కుమారుడు గ్రామంలోనే లేడని బెంగళూరులో ఉద్యోగం చేసుకుంటూ అక్కడే ఉన్నాడని ఏనాడు కూడా వరుసగా చెల్లెలైన సృజనతో తన కుమారుడు మాట్లాడిన సందర్భం కూడా లేదని ఇంజనీర్ తల్లిదండ్రులు ఫిర్యాదులు పేర్కొన్నారు. సృజన తండ్రి అయిన చంద్రగిరి ఉత్తయ్య (55) గ్రామంలోని ఒక మహిళ తో సన్నిహితంగా మెలగడం వలన సృజన, ఆయన భార్య పరమేశ్వరి నిత్యము గలాట పడేవారిని ఆయన కూడా వారిని కొడుతూ తిడుతూ ఉండేవాడని ఫిర్యాదులు వివరించారు. తాగుడు అలవాటు ఉన్న చంద్రగిరి ఉత్తయ్య భార్య, పిల్లలను తననే ప్రశ్నిస్తారా అని నిత్యము కొడుతూ తిడుతూ ఉండే వాడని పేర్కొన్నారు. చనిపోయిన సృజనకు రాయచోటి పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన చరణ్ అనే అబ్బాయి, నగేష్ అనే మరో అబ్బాయి సృజన తండ్రి ఫోన్ ద్వారా సృజనకు నిత్యము ఫోన్ చేస్తూ ఆమెను వేధిస్తూ ఉన్నారని అందరికీ తెలుసని ఈ సమస్యతో కూడా సృజనా, తండ్రి చంద్రగిరి ఉత్తయ్య నిత్యము సృజనను కొడుతూ తిడుతూ ఉండేవారన్నారు. సృజన కుటుంబంలో ఉన్న ఈ రెండు సమస్యలతోనే ఆమె ఘర్షణపడి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చు గాని తమ కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని సాఫ్ట్వేర్ ఇంజనీర్ తల్లిదండ్రులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడైన తారకనాథ్‌కు చనిపోయిన సృజన వరుసకు చెల్లెలు కావాలని అలాంటిది వారి మధ్య ప్రేమ వ్యవహారం ఉండేదని అది ఒప్పుకోకపోతే తండ్రిని చంపేస్తానని తారక్‌నాథ్ అన్నాడని ఒక తప్పుడు ఫిర్యాదును ఆమె తల్లిదండ్రుల చేత దశరథ రామ్ రెడ్డి ఇప్పించి దుర్మార్గమైన చర్యకు పాల్పడ్డారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. సృజన తల్లిదండ్రుల ఫోన్ కాల్ రికార్డ్స్ తీసినట్లైతే మైనర్ బాలిక సృజన ఆత్మహత్యకు కారణాలు తెలిసిపోతాయని, నిజాయితీగా విచారణ జరిపి అమాయకుడైన తన కుమారుడిని కేసు నుండి తొలగించాలని వారు పేర్కొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి బాబు రెడ్డి

విశాలాంధ్ర- పీలేరు : నియోజకవర్గ కేంద్రం పీలేరు మేజర్ పంచాయతీ అభివృద్ధికి ఉద్యోగులు, సిబ్బంది కార్మికులు సహకారం అందించాలని రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, పంచాయతీ అభివృద్ధి కమిటీ సభ్యులు కోటపల్లి బాబు రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పీలేరు పంచాయతీ కార్యాలయంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు సమన్వయంతో వ్యవహరించి పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. 100% పన్నులు వసూలు చేసి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పట్టణాన్ని ఆదర్శ పంచాయతీగా ఈ చిదిద్దుకోవాలని పారిశుద్ధి కార్మికులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి మంచి పేరు తేవాలని ఆయన పిలుపునిచ్చారు. పంచాయతీలో పనిచేస్తున్న ఎలక్ట్రిషన్ లు ఎక్కడైనా వీధి దీపాలు వెలగలేదంటే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయన సూచిం చారు. పంచాయతీ పరిధిలో అవసరానికి మించి పని చేస్తున్న ఉద్యో గులు కార్మికులు ఎంతమంది ఉన్నారో సమాచారం ఇవ్వాలని ఇన్చార్జ్ కార్యదర్శి లతీఫ్ ఖాన్ కు ఆయన సూచించారు. పీలేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామ్మూర్తి, పీలేరు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనాథ్ రెడ్డి. జెడ్పిటిసి మాజీ సభ్యులు మల్లెల రెడ్డి భాష, పీలేరు పట్టణ అధ్యక్షులు సురేష్ కుమార్ రెడ్డి (కంచి సూరి) ప్రముఖ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జై చంద్రా రెడ్డి, షామియానా జయన్న తెలుగు యువత పీలేరు నియోజకవర్గ అధికార ప్రతినిధి స్పోర్ట్స్ మల్లి, పీలేరు మండల తెలుగు యువత అధ్యక్షులు షేక్ రియాజ్, పీలేరు నియోజకవర్గ బీసీ అధ్యక్షులు వసంతల రాజా, యువ నాయకులు గుర్రం నరేష్ కుమార్ రెడ్డి,అత్తార్ చాన్ భాష, ఖాజాపీర్, షోఖత్ రైతు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రెడ్డి ముని, అబ్బవరం సురేష్, నౌలాక్, షమ, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలు వంకలు దురాక్రమణ

అఖిలభారత మాల సంఘాల జేఏసీ నాయకుల ఆరోపణ

విశాలాంధ్ర- పీలేరు: స్మశాన వాటికలు వంకలు దురాక్రమణ పై పీలేరు తాహసిల్దార్ కి అఖిలభారత మాల సంఘాల జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ బండమీద దళితవాడ గ్రామానికి దక్షిణ భాగాన పడమర నాగప్ప చెరువు ఉన్నది నాగప్ప చెరువు నుండి మరో పోతే ఆ కాలువ వెంచే నదిలోకి కలుస్తుంది. గతంలో 2021, 22 కొంతమంది అగ్రకులస్తులు పూర్తిగా వంక పసల మంద కబ్జా చేసినారు వర్షాలు కురిస్తే బండమీద హరిజనవాడ పూర్తిగా ముంపుకు గురి అవుతుంది గతంలో రెవెన్యూ వారికి ఎన్నో దపాలుగా ఫిర్యాదు చేయడం జరిగినది కానీ ఎటువంటి స్పందన రాలేదు. బలం వారి పల్లి పంచాయతీ నాలె వాండ్లపల్లి ఎస్సీ కాలనీ కాలనీకి దొడ్డిపల్లి పంచాయతీ సరిహద్దు పంచాయతీగా కాను 70 సెంట్లు దొడ్డిపల్లి పంచాయతీలో రెవెన్యూ వారు స్మశానానికి కేటాయించబడినది కావున ఇప్పుడు కొంతమంది దురాక్రమించడం జరిగినది. గోడరేవుపల్లి పంచాయతీ సర్వే నెంబర్ 455 లో రెండు ఎకరాలు గోడరేవుపల్లి మాలపల్లికి ఎకరా స్మశానం వాటికకు ఎకరా డంపింగ్ యార్డ్ కు కేటాయించడం జరిగింది గతంలో ప్రజాప్రతినిధులు ఆ స్మశాన వాటికలో మట్టి తవ్వకాలు చేసి దౌర్జన్యముగా పూర్తిగా మట్టిని తవ్వేశారు కింద పూర్తిగా బండ ప్రాంతం ఏర్పడింది కావున మాకు గోడరేవుపల్లి మాలపల్లి కు తక్షణం పరిశీలించి మాకు వేరేచోట స్మశానమునకు స్థలం కేటాయించాల నీ గతంలో ఎన్నో మార్లు ఫిర్యాదు చేసిన స్పందన రాని కారణంగా ఇకనైనా సమస్యను పరిగణలోకి తీసుకొని దళిత సమస్యలు పరిష్కరిస్తారని అఖిలభారత మాల సంఘాల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గుర్రం నారాయణ తాహా సిల్దార్ కి తెలియజేశారు.. ఇంకా జాన్ల పంచాయతీ పెద్ద హరిజనవాడ, చీరప రెడ్డి గారి పల్లి దళితవాడ ఈ గ్రామాలలో ఇంతవరకు స్మశాన వాటికలు లేవు కావున తాహా సిల్దారు తక్షణం స్పందించి నేను పరిష్కరిస్తానని అఖిలభారత మాల సంఘాల జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎం ఎం ఐక్యవేదిక పీలేరు మండల అధ్యక్షులు చీకటిపల్లి మల్లికార్జున ఏ బి ఎమ్మెస్ జేఏసీ జిల్లా నాయకులు మధ్యలో రమేష్ పల్లం నాగరాజు జి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రైవేటు కళ్యాణ మండపంలో జనసంఘ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘననివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి పట్నం తొట్టంబేడు మండలాల కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. నరేంద్రమోదీ 11 సంవత్సరాలు సుపరిపాలనపై వివరించారు. ముందుగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ దేశం కోసం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఒకే ప్రధాని... ఒకే జెండా. ఒకే చట్టం అనే నినాదంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. జమ్ము కాశ్మీర్ స్వయంప్రతిపత్తి ఆర్టికల్370 రద్దు కోసం ఆయన విశ్రాంతంగాపోరాటం చేశారన్నారు. ఆయన బాటలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నడిచి 370 ఆర్టికల్ను రద్దు చేయడంలో సఫలీకృతం అయ్యారన్నారు. ప్రధానమంత్రి 11 ఏళ్ల సుపరిపాలనపై నాయకులు, కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, చంద్రప్ప, కంద్రిగ ఉమ, శైలజ, గోపాల్, ప్రజ్ఞశ్రీ, వెంకటేష్, హరీష్ రెడ్డి, గరికపాటి రమేష్, అమర్నాథ్, ఢిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందని ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం సీపీఐ అనేక రాజీలేని పోరాటాలను చేసిందన్నారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో భూసమస్యలు ఇంటి సమస్యలు పరిష్కార దిశగా చేపట్టి పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. శతజయంతి ఉత్సవాలను సీపీఐ నిర్వహించుకుంటోందని తెలిపారు. మహాసభల సందర్భంగా సీపీఐ వంద జెండాలతో ర్యాలీలు, చేపట్టం, వంద చెట్లు నాటడం, వంద కాగడాలతో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. ప్రజలను ఇందులోభాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రొద్ద గోపి, జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షులు చారులత, శాఖ కార్యదర్శులు మునెమ్మ, గంగమ్మ, మునిరాజ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు అందేలా చూడాలి

విశాలాంధ్ర-చంద్రగిరి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు గ్రామీణ స్థాయిలో ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని ఆ పార్టీ నేతలు తెలిపారు. సోమవారం భారతీయ జనతా పార్టీ చంద్రగిరి బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో జనసంగ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన సందర్భంగా కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు టి. సుబ్రహ్మణ్య యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్యాం ప్రసాద్ ఒకే దేశం ఒకే చట్టం ఒకే ప్రజా అనే నినాదంతో ఎలుగెత్తి చెప్పారని తెలిపారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక పథకం భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టినటువంటి పథకాలను గ్రామీణ స్థాయిలో ప్రతి ఒక్క పేదవాడికి అందే విధంగా చూడాలని కోరారు. అలాగే శ్యాం ప్రసాద్ యొక్క బలిదానం ఏ విధంగా జరిగినదనే విషయాన్ని కార్యకర్తలకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి నాయకులు ముని గంగిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు టి ఏ ప్రసాద్, కాకిమా ను మునిరాజ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ యాదవ్, జిల్లా కార్యదర్శి దీనదయాల్ నాయుడు, సంగీతం దొరస్వామి, మోహనరాజులు, దొరస్వామి నాయుడు, ఇందు శేఖర్ పాల్గొన్నారు.

సాధికారతతో సుపరిపాలన సాధ్యం: డిఎల్‌డివో

విశాలాంధ్ర-గూడూరు: సాధికారత తో సుపరిపాలన సాధ్యమని గూడూరు డిఎల్డివో వాణి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో ఎనిమిది మండలాలకు సంబంధించిన మహిళ సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత-గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు పై మూడు రోజులు పాటు మహిళా సర్పంచ్ లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీడీవో మధుసూదనరావు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఏం.ఎ.టి. ఎంపిడిఓ బ్రహ్మయ్య, ఆర్పిలు, గూడూరు, మనుబోలు, బాలయపల్లి, డక్కిలి, కోట, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి మండలాల మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం
ప్రజా విజ్ఞప్తుల దినం

విశాలాంధ్ర-వెంకటగిరి: తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ 14 వ వార్డు కౌన్సిలర్ మరియు వెంకటగిరి నియోజకవర్గ వై.యస్. ఆర్.సి.పి. పార్టీ ఆర్.టి.ఐ. విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య వెంకటగిరి మున్సిపాలిటి సుధర్శన్ నగర్ సచివాలయంలో-8 సోమవారం ప్రజా విజ్ఞప్తుల రోజు జరగడం జరిగినది . ఇందులో భాగంగా 14 వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ప్రజల దగ్గరనుండి అర్జీలు స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది. 15వార్డు హనుమాన్ నగర్ లో వాటర్ ట్యాంక్ కి గెట్ వాల్ పనిచేయక నీరు మొత్తం వృధాగా పోతున్నాయి. ఈ ట్యాంక్ నుండి 14,15,16,17,18,వ వార్డులకు నీరు సరఫరా చేస్తుంది .గేట్ వాల్ రిపేర్ వలన పై 6 వార్డులకు నీటి సరఫరా నిలిచిపోయినది. బొగ్గుల మిట్ట నందు నీటి మోటార్ కాలిపోవడం వలన అశోక్ ఏ.ఈ సిబ్బందితో వచ్చి మోటారు రిపేర్ కి తీసుకొని వెళ్లారు, సాధ్యమైనంత త్వరగా మోటర్ బాగుచేసి అమర్చవలసినదిగా కోరుతున్నాము. 14వ వార్డు బొగ్గులమిట్ట నందు జయరామయ్య ఇంటి ముందు మురుగు గుంట నందు నీరు చేరి ఎటు వెళ్ళుటకు వీలులేకపోవడం వలన, దుర్గంధం బరితంగా ఉంది మరియు దోమల విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. పై విషయాలను మున్సిపల్ కమిషనర్ పరిశీలించి తగిన పరిష్కారాలు చూపవలెను.

స్కూల్లు విలీనం చేయొద్దని గ్రామస్తుల నిరసన

విశాలాంధ్ర-పలమనేరు : రూరల్ మండలం, కొలమాసనపల్లి పంచాయతీ, అయ్యంరెడ్డిపల్లి గ్రామస్తులు స్కూల్లను విలీనం చేయొద్దని పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. వారి కథనం మేరకు అయ్యంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలను శ్రీరంగరాజ పురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలతో విలీనం చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ రెండు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల దూరం ఉంది. దారి పొడవునా వాగులు వంకలు దాటుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గతంలో అనేక సార్లు వర్షాలు పడినప్పుడు వాగులు పొంగి వరద నీరు రోడ్డుపై ప్రవహించాయి. తగ్గుప్రాంతం అయినందున చిన్నపాటి వర్షానికే వరద నీరు రోడు పైకి చేరుతోంది. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలను బడికి ఎలా పంపించాలని అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడున్న పాఠశాలనే కొనసాగించాలని, లేదంటే పిల్లలకు బడి మాన్పించడం తప్ప మరొక దారి లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పలమనేరు శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ స్పందించి అయ్యంరెడ్డిపల్లి పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏయం పురం క్వారీ లీజు అనుమతులు రద్దు చేయండి

తహసిల్దారు రాజశేఖర్‌కు సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి వినతి

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం అలిమేలు మంగాపురం గ్రామంలో నడుస్తున్న గ్రావెల్ క్వారీ లీజు అనుమతులను రద్దు చేయాలని గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి అధికారులకు విన్నవించారు.సోమవారం గ్రీవెన్స్ డేను పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దారు రాజశేఖర్ను కలిసి గ్రావెల్ క్వారీ ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మాట్లాడుతూ ప్రధానంగా రిజర్వ్ ఫారెస్టుకు 100 మీటర్ల లోపే క్వారీ నడుస్తుందన్నారు. రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 305లో గ్రావెల్ క్వారీకి అనుమతులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. అయితే ఇదే గాక 307, 322 సర్వే నెంబర్ భూమిలోను అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నట్టు ఆమె ఆరోపించారు. దీంతోపాటు 11 కెవి విద్యుత్తు లైన్ పోల్ చుట్టూ మట్టి తవ్వకాలు జరపడంతో ప్రమాద భరితంగా మారిందన్నారు.అందువల్ల దీనిపై విచారించి గ్రావెల్ క్వారీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని తహసిల్దార్ రాజశేఖర్కు సమర్పించారు. కాగా గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో అనుమతులు తీసుకొని గ్రావెల్ తరలించిన అప్పట్లో అభ్యంతరం చెప్పని గ్రామ సర్పంచ్ ప్రస్తుతం క్వారీ లీజులు రద్దు చేయాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించడంపై విమర్శలు వినిపించడంతోపాటు చర్చనీయాంసంగా మారింది.

పాలిటెక్నికల్ కోర్సుల అడ్మిషన్ల కోసం
కొనసాగుతున్న కౌన్సిలింగ్

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో పాలిటెక్నికల్ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించి పాలీసెట్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి ఆధ్వర్యంలో ప్రధాన పరిశీలన అధికారిని రిజ్వాన్, పరిశీలనాధికారి జోత్స్న, బీసీ సంక్షేమ వసతి గృహాధికారి గంగాధర్ బృందం కౌన్సిలింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలిసెట్ ప్రవేశ పరీక్షల్లో ర్యాంక్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పదవ తరగతి మార్క్ లిస్ట్, కౌన్సిలింగ్ ఫీజు చెల్లింపు రసీదు వంటివి పరిశీలించి వెబ్ ఆన్లైన్లో ఆప్షన్ కూడా నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం 32001 నుంచి 50000 వరకు ర్యాంకు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లో పరిశీలన జరుగుతోంది. పలు ప్రాంతాల నుంచి పలువురు విద్యార్థులు అధికారులు నిర్వహిస్తున్న కౌన్సిలింగ్కు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. తొలిసారిగా కౌన్సిలింగ్ కేంద్రాన్ని సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలకు కేటాయించారు.

పజల ప్రాణాలంటే లెక్కలేని వ్యక్తి నాయకుడా..

- హత్య, శవ రాజకీయాలు చెయ్యడంలో జగన్ రెడ్డి దిట్ట
- కార్యకర్తలను రెచ్చగొట్టి వారి జీవితాలను నాశనం చెయ్యడమే జగన్ లక్ష్యం
- మానవత్వం ఉండదు, బాధ్యత అసలే ఉండదు
- రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు

విశాలాంధ్ర-రాజంపేట: కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసేవాడే నాయకుడని, అలా కాకుండా కార్యకర్తల ప్రాణాలకు, నమ్ముకున్న వారికి భరోసా ఇవ్వలేనీ నాయకుడే జగన్‌రెడ్డి అని రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. సోమవారం పార్లమెంటు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో ఇద్దరు చనిపోయినా కనీస పశ్చాతాపం లేని వ్యక్తి నాయకుడా అని ప్రశ్నించారు. చనిపోయారు అని తెలిపిన కనీసం పరామర్శించక పోవడం జగన్ నైజం ఏమిటో అర్థమవుతుందా అన్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్లకు పరామర్శలు యాత్రలా చేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ప్రజలు ఛీకొట్టినప్పటికీ హత్యా , శవ రాజకీయాలతో సాధించేదేమిటి అని ప్రశ్నించారు. నాయకుడికి కార్యకర్తల కంటే గంజాయి బ్యాచే ముఖ్యమా అంటూ చనిపోయిన వారిని పక్కకు ఈడ్చి జేజేలు కొట్టించుకోవడం నాయకుని లక్ష్యమా అన్నారు. కార్యకర్తల బెదిరింపులను కూడా సమర్థిస్తున్న సైకోను ప్రజలు గమనిస్తున్నారని, జగన్ ప్రచార ఆర్భాటానికి వృద్ధుడు మృతి చెందడం బాధాకరమన్నారు. సకాలంలో వైద్యం అందించి ఉంటే బతికేవాడు కదా, అలాకాకుండా ప్రమాదంపై పక్షతాపం లేకుండా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు అన్నారు. రాష్ట్ర ప్రజలు కూడా దిగజారుడు రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. సొంత బాబాయ్నే లేపెసినోడికి ప్రజలు ఒక లెక్కా అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి నాయకులు బాపనయ్య నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, పోలి చెరువు ప్రెసిడెంట్ నాగినేని నాగేశ్వర రావు, ప్రొద్దుటూరు అబ్జర్వర్ సుబ్రహ్మణ్యం నాయుడు, యువ నాయకులు పరశురాం నాయుడు. తేజాల ఆనంద్ పాండురాజు, వెంకటేశ్వర్లు నాయుడు, కళాధర్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే మా లక్ష్యం

- ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: ప్రజా సమస్యలు పరిష్కరించడమే మా ప్రధాన లక్ష్యం అని కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. ముక్కావారిపల్లిలో సోమవారం ముక్కా వరలక్ష్మి తమ ఛాంబర్లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలు పరిష్కరించారు. నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, చిట్వేల్, పుల్లంపేట, పెనగలూరు, కోడూరు మండలాల నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను వరలక్ష్మి దృష్టికి తెచ్చారు. భాదితులను ఒక్కొక్కరిని పిలిచి వారి సమస్యలు ఓపికగా విని అర్జీదారుని సమస్యపై సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఫోన్ చేసి పరిష్కరించారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ వరలక్ష్మి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భాదితులు తమ దగ్గరికి వచ్చినప్పుడు వారిని నిరుత్సాహ పరచకుండా సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తున్నారని భాదితులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వరలక్ష్మి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో సీటు కోసం వచ్చిన వారికి న్యాయం చేశారు. భూ సమస్యలు పరిష్కరించారు. తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడ్డ కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. సమస్యలు పరిష్కారం కోసం వచ్చే భాదితులు అయా మండల, పంచాయితీ లీడర్ల ద్వారా రావాలని సూచించారు. లీడర్లకు చెప్పకుండా వస్తే సమస్యలు పరిష్కరించడం కుదరదని కరాఖండిగా చెప్పారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం వచ్చిన బాధితులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి మానవత్వం చాటుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే భాదితులను అదుపు చేయడం సాధ్యం కాలేదు. ఈ కార్యక్రమంలో సింగమాల విశ్వనాథ్ రెడ్డి, మహెంధర్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, కృష్ణమనాయుడు, రాహుల్ రెడ్డి,గుండాల్ రెడ్డి, శరణ్ పాల్గొన్నారు.

కంటి వైద్య విభాగం డాక్టర్లకు ఘన సన్మానం

విశాలాంధ్ర-కడప: కడప రిమ్స్ జనరల్ హాస్పిటల్ నందు కంటి వైద్య విభాగమునందు ఇన్చార్జ్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ కిరణ్మయి కాకినాడ గవర్నమెంట్ రంగరాయ మెడికల్ కాలేజీకి ,అదేవిధంగా జనరల్ హాస్పిటల్ లో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డాక్టర్ కస్తూరిబాయ్, కంటి వైద్యవిభాగం నంద్యాల గవర్నమెంట్ మెడికల్ కాలేజీకి బదిలీ ఆయన సందర్భంగా కంటి వైద్య విభాగం డాక్టర్లు సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు .ఈ సందర్భంగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి కే. చిన్నయ్య మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు చేయడంలోనూ ఫ్యాకల్టీని సిబ్బందిని పరిపాలనలోనూ సుపరిపాలన మంచి విధానము అవలంబించారని వారు లేనీ లోటు పూడ్చలేనిదని వారు ఎక్కడ పని చేసినా అక్కడ కంటి రోగులకు, ఫ్యాకల్టీకి, సిబ్బందికి తమ మంచి సేవలు అందించాలని అభిలాషిస్తూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో డాక్టర్ ఆస్మా అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ సూర్య ,డాక్టర్ కవిత, డాక్టర్ కల్పన, డాక్టర్ మౌనిక, డాక్టర్ భారతి, డాక్టర్ నరేష్, జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, కిరణ్ వైద్య విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొని ఘనంగా వీడ్కోలు పలికారు.

తప్పుడు కేసులతో తలలు పట్టుకుంటున్న రాష్ట్ర ప్రజలు

- జగన్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-చెన్నూరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై తప్పుడు కేసులతో రాష్ట్ర ప్రజలు బెజారెత్తుతున్నారని, ఎలాగైనా మాజీ ముఖ్య మంత్రి వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డిని నా ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం కుయుక్తులు పడుతుందని వైసీపీ యువ నాయకులు తుమ్మలూరు రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రజలతో మాట్లాడుతూ సోమవారం టీవీ5, ఏబీఎన్ ఛానల్‌లో చెపుతున్నది ఏంటి. సింగయ్య మృతిపై ఎస్పీ సతీష్ కుమార్ గారు నాడు స్పష్టంగా చెప్పారు, జగన్ కాన్వాయ్ లో కారు కాదు ప్రైవేటు వాహనం ఢీ కొట్టి చనిపొయారు అని.కారు నెంబర్ కూడా పలానా అంటూ ఎస్పీ గారు చెప్పారు. తెలుగుదేశం వాళ్ళే ప్రచారం కూడా చేసారు. ఇప్పుడు ఏకంగా ఒక ఫేక్ వీడియో తెచ్చి జగన్ కారే ఢీ కొట్టిందని ప్రచారం చేస్తున్నారు. అంటే నాడు ఎస్పీ గారు చెప్పినది తప్పుడు సమాచారం అని అటున్నారా కూటమి ప్రభుత్వం నాయకులు, సరే ఇప్పుడు ప్రచారం చేస్తున్న వీడియోలో చూస్తే ఫార్చ్యూనర్ కార్ టైర్ సింగయ్య తలపైకి ఎక్కినట్టు చూపిస్తున్నారు. నిజానికి 3700 కేజీల బుల్లెట్ ప్రూఫ్ కారు ఒక మనిషి తలమీదకు ఎక్కితే తల చితికిపోతుంది కనీసం ముఖము పైన చిన్న గీతలు కూడా లేవు ఒంటిపైన దెబ్బలు కూడా లేవు కానీ సింగయ్య మృతదేహం చూస్తే తల పైకి కారు ఎక్కినట్టుగా కనిపించడంలేదు. మరి ఆ వీడియో నిజమైనదా లేక సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిపోయిన ఈ రోజుల్లో తయారు చేయబడ్డ వీడియోనా, అనేది కూడా తేలాలి. మొదట, టీవీ ఫైవ్‌లో కాన్వాయ్ గుద్దితే ఎగిరి పడిన వ్యక్తి కనీసం పట్టించుకోకుండా వెళ్లిపోయారు అని చూపించారు. అదే టీవీ 5లో టైర్ కింద పడిన వ్యక్తి తొక్కించి చంపేశారు అని చూపిస్తు న్నారు.. గతంలో ఎస్పీ గారు ప్రైవేటు వాహ నం తగలటంతో చనిపోయాడు అంటూ ఆ వాహనం నెంబర్‌తో పాటు చెప్పాడు.టైరు కిం ద పడిపోయిన మనిషి ఎగిరి ఎలా పడతాడు ఎగిరి టైరు కింద పడొచ్చు గాని, టైర్ కింద పడిన నలిగిపోయిన వ్యక్తి ఎలా ఎగురుతాడు ఈ..పాయింట్ టీవీ5 ఛానల్ చెప్పాలీ, వీడి యోలు కూడా ఎడిట్ చేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పైన ఎలాగైనా కేసులు పెట్టి ఇబ్బంది పెట్టాలని అనేక సెక్షన్ల కింద కేసు పెట్టడం జరిగినది. ముందు కట్టిన కేసులో బిఎన్ఎస్ 106 (1) కట్టినారు మరి కొన్ని సెక్షన్లు యాడ్ చేసి బిఎన్ఎస్ బిఎన్ఎస్ 105 సెక్షన్ యాడ్ కావడంతో శిక్ష పడితే ఐదు సంవత్సరాల నుండి పది సంవత్సరాలు జైలు ఉంటుంది ఇ లా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి పైన తప్పుడు వీడియోలు తయారు చేసి కేసులు పెట్టి ఇబ్బందులు పాలు చేయాలని చూస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-రామసముద్రం: ఆంధ్రప్రదేశ్ - కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో గుర్తు తెలియని వాహనం ఢీకొని రామసముద్రం మండలవాసి దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎలువనెల్లూరు పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. నారాయణప్ప కుమారుడు వెంకటరమణ 43 సం, సొంత పనిపై సోమయాజులపల్లికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా ఆంధ్ర సరిహద్దుకు వంద మీటర్ల దూరంలో కర్ణాటక పరిధిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె కలరు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

క్రమశిక్షణతో కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు

- ఎంఎల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర-కడప: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఎల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లి శివారులోని హ్యాపీ కిడ్స్ హై స్కూల్ కరెస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని సోమవారం ఎంఎల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మీలో ఎంత మందికి తల్లికి వందనం డబ్బులు పడ్డాయని ఎంఎల్సీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ సహకారన్ని సద్వినియోగించుకోవాలన్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒక ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా రూ. 13000 ఆర్థిక సహాయాన్ని వారి తల్లుల ఖాతాలోకి డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ ద్వారా ప్రభుత్వం వారి తల్లి ఖాతాలోకి డబ్బులు జమ చేసి ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. కష్టపడి చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ వెన్నుదున్నుగా ఉంటుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువులో బాలికలే రాణిస్తున్నారనడానికి వారు సాధిస్తున్న అత్యధిక మార్కులే కారణమన్నారు. అలాగే ఉద్యోగాల్లో సైతం అత్యధికంగా మహిళలే ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. దేశంలోనే అత్యంత కఠినమైన యూపీఎస్సీ పరీక్షలలో సైతం పట్టుదలతో చదివి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లను బాలికలు సాధిస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన భారత్ - పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో కూడా భారత్ కు చెందిన ఖురేషి అనే మహిళా పైలెట్ కేవలం 25 నిమిషాల్లో పాకిస్తాన్ పై బాంబుల వర్షం కురిపించి మళ్ళీ భారత్ కు చేరుకుందన్నారు. బాలికలను స్ఫూర్తిగా తీసుకుని బాలురు కూడా ఐఐటీ, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, టెక్నాలజీ విభాగాల్లో రాణించి తల్లిదండ్రులకు చదువుకుంటున్న విద్యాసంస్థకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని సూచించారు. తదనంతరం ఎంఎల్సీ తో కరచాలనం చేసేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మజ, పాఠశాల కరెస్పాండెంట్ కుడుముల అనిల్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ శివకుమారి, ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులును అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

విశాలాంధ్ర-సంబేపల్లె: సంబేపల్లెలోని గృహేస్వరి పశుపతి నాద ఆలయంలో సోమవారం భాగవతారిని శారద ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అల్లరింప చేశాయి. గృహేశ్వరి పశుపతి నాథ ఆలయం శివనామ స్మరణలతో మార్మోగినది. ఉదయం స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పశుపతి నాధుని కృపకు పాత్రులయ్యారు. గాత్రం ఆనంద

రెడ్డి, కీ బోర్డ్ రెడ్డెయ్య, తబలా ఎం. గోవిందయ్యలు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరింపచేశాయి.